క్లుప్తంగా

ఎక్సరే లాబీ వితరణ



గుంటూరు మెడికల్: మా అడ్వాన్స్‌డ్ స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు డాక్టర్ మందపల్లి ఆదినారాయణరావు గురువారం గుంటూరు వైద్య కళాశాలకు ఎక్సరే లాబీని వితరణగా అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నాగార్జునకొండ వెంకటసుందరాచారీకి అందించారు. ఎక్సరే ఫిల్మింలు పరిశీలించేందుకు దీనిని ఉపయోగిస్తారు. గతంలో కూడా డాక్టర్ ఆదినారాయణరావు జీజీహెచ్ న్యూరాలజీ వైద్య విభాగానికి, రేడియాలజీ వైద్య విభాగానికి డిజిటల్ ఎక్సరే ఫిల్ములు చూసే బోర్డులను, సూపరింటెండెంట్ కార్యాలయం, ఇతర వార్డుల్లో కూలింగ్ వాటర్ కూలర్లను వితరణగా అందజేశారు. డాక్టర్ ఆదినారాయణరావును ప్రిన్సిపాల్ అభినందించారు.

జీఎన్‌ఎం నర్సింగ్ పరీక్షల తనిఖీ

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్, గుంటూరు వైద్య కళాశాలలో జరుగుతున్న జనరల్ నర్సింగ్ అండ్ మిడ్ వైఫరీ (జీఎన్‌ఎం) వార్షిక పరీక్షలపై ఆరోపణలు రావడంతో గురువారం అడిషనల్ డీఎంఈ డాక్టర్ వెంకటేష్ తనిఖీలు చేశారు. విద్యార్థులు పరీక్షలు రాస్తున్న తీరును పరిశీలించారు. ఆయనతో పాటు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ, నర్సింగ్ రిజిస్ట్రార్ సుశీల ఉన్నారు.

హాస్టల్స్ నిర్వహణ పక్కాగా ఉండాలి

నెహ్రూనగర్: సంక్షేమ హాస్టల్స్ నిర్వహణ పక్కాగా ఉండాలని సోషల్ వెల్ఫేర్ డీడీ డి. మధుసూదన్‌రావు హాస్టల్ వార్డెన్లకు సూచించారు. ఇటీవల ఎస్సీ బాలికల హాస్టల్‌లో ఓ విద్యార్థిని గర్భవతి అయి బిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. ఇది రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. బుధవారం హాస్టల్స్ నిర్వహణపై సోషల్ వెల్ఫేర్ డైరెక్టర్ లావణ్య వేణి జూమ్ మీటింగ్ ద్వారా ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో గురువారం జేకేసీ కాలేజ్ ఆఫ్ లాలో గుంటూరు జిల్లాలోని హెచ్‌డబ్ల్యూఓలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి హాస్టల్ నిర్వహణకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ముఖ్యంగా బాలికల హాస్టల్‌లో వార్డెన్లు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మినిట్స్ బుక్ తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు.

ఏపీ హంస క్యాలెండర్ ఆవిష్కరణ



గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు బి. నాగిరెడ్డి ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను గురువారం గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ సిటీ సెక్రటరీ లంకపల్లి శ్రీనివాస్, జిల్లా ఉమెన్ వింగ్ సెక్రటరీ రూన్సీరాణి ,శ్రీకాంత్, జిల్లా వైస్ ప్రెసిడెంట్ ప్రశాంతి, కుమారి, ఆశాలత, కొడాలి పద్మ, రాజ్యలక్ష్మి, హిమబిందు, వెంకట్, నరసింహారావు, అరుణ్‌బాబు పాల్గొన్నారు.

కొనసాగుతున్న న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు

నగరంపాలెం: స్థానిక జిల్లా కోర్టు ప్రధాన ద్వారం వద్ద న్యాయవాదుల రిలే నిరాహార దీక్షలు గురువారం కొనసాగాయి. సీనియర్ న్యాయవాది జి.శాంతకుమార్, టి.ఆనంద్‌శ్రీనివాసరావు, గీతా వాణి, మస్తాన్‌వలి, కాలే దేవదాసు, సన్నీ, అనీల్, కాలేషాబేగ్ రిలే నిరాహార దీక్షలో కూర్చున్నారు. గుంటూరు బార్ ఫెడరేషన్ చైర్మన్ కాసు వెంకటరెడ్డి మాట్లాడుతూ పొన్నూరు న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పోలీసులు అమానుషంగా దాడికి పాల్పడ్డారని ధ్వజమెత్తారు. స్టేషన్ సీఐ, ఎస్‌ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజోన్నల బ్రహ్మరెడ్డి మాట్లాడుతూ న్యాయవాదులు విధులు బహిష్కరించి రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా పోలీసులపై ఆ శాఖ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. ఇప్పటికైనా వారిపై వెను వెంటనే చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ద్విచక్ర వాహనం చోరీ

లక్ష్మీపురం: షాపు ముందు పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం ఉదయం లేచి చూసే సరికి కనిపించక పోవడంతో బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు గురువారం పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. గుజ్జనగుండ్ల ప్రాంతానికి చెందిన కాసా శ్రీనివాసరావు కరెంటు పని చేసుకుంటూ జీవనం సాగిస్తుంటాడు. షాపులో పని చేసే తోటి స్నేహితుడు వాహనాన్ని తీసుకెళ్లాడు. అతడు పని ముగించుకుని రాత్రి 11 గంటలకు ఇంటి బయట వాహనాన్ని పార్కింగ్ చేశాడు. ఉదయం లేచి చూసే సరికి కనిపించలేదు. వెతికినా కనిపించక పోవడంతో గురువారం పట్టాభిపురం పోలీస్‌స్టేషన్‌లో శ్రీనివాసరావు ఫిర్యాదు చేశాడు. పోసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొలి దశలోనే

డ్రెయిన్లపై ఆక్రమణలకు అడ్డుకట్ట

నగర కమిషనర్ పులి శ్రీనివాసులు



సిబ్బందికి ఆదేశాలు జారీ చేస్తున్న కమిషనర్ పులి శ్రీనివాసులు

నెహ్రూనగర్: సచివాలయ కార్యదర్శులు క్షేత్రస్థాయిలో బాధ్యతతో విధులు నిర్వహించాలని, రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణలను తొలి దశలోనే అడ్డుకోవాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు స్పష్టం చేశారు. గురువారం కమిషనర్ కోబాల్ట్ పేట, పట్టాభిపురం, తారకరామ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. సచివాలయ కార్యదర్శులకు, అధికారులకు పలు ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలు స్థానికంగా ఎదుర్కొనే పారిశుద్ధ్యం, వీధి దీపాలు, తాగునీటి సరఫరా సమస్యలపై సచివాలయ కార్యదర్శులు సంయుక్తంగా బాధ్యత తీసుకోవాలని చెప్పారు. ప్రతి రోజు సచివాలయ పరిధిలో ప్రజలతో మమేకమవుతూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రధానంగా రోడ్లు, డ్రెయిన్ల ఆక్రమణలను తొలిదశలోనే అడ్డుకోవాలని స్పష్టం చేశారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించేలా ఇంజినీరింగ్ అధికారులు పర్యవేక్షణ చేయాలని చెప్పారు. పనులను నేరుగా పరిశీలించిన అనంతరం బిల్లుల చెల్లింపుకు ప్రాసెస్ చేస్తామన్నారు. ఇంజినీరింగ్ అధికారులు నూతన రోడ్ల ఏర్పాటు ప్రతిపాదనల్లో తప్పనిసరిగా ఎండ్ టూ ఎండ్ రోడ్, డ్రెయిన్లు ఉండేలా చూడాలని చెప్పారు. తారకరామ నగర్ రోడ్ విస్తరణ పనులకు ఆర్‌డీపీని వేగంగా సిద్ధం చేయాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. ఈ పర్యటనలో డీఈఈలు రమేష్ బాబు, శ్రీనివాస్, ఏసీపీ రెహ్మాన్, ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో సంక్రాంతి సంబరాలు

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్ ఐసీటీసీ, పీపీటీసీటీ ఆధ్వర్యంలో గురువారం ముందస్తు సంక్రాంతి సంబరాలు జరిగాయి. మైక్రోబయాలజీ వైద్య విభాగాధిపతి డాక్టర్ జయలక్ష్మి కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. హెచ్‌ఐవీ సోకిన పది మందికి నిత్యావసర వస్తువుల పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కాత్యాయని, డాక్టర్ క్వీని లినా, డాక్టర్ నాజియా, ల్యాబ్ టెక్నీషియన్ ముస్తఫా, మేరీ కుమారి, కౌన్సిలర్ సుబ్బారావు, గాలి శ్రీనివాస్, విజయారాణి, పులి శ్రీనివాస్, అహ్మద్ అలి, నాగలక్ష్మి , సుధారాణి పాల్గొన్నారు.



నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న డాక్టర్ జయలక్ష్మి

దాతల సాయం అభినందనీయం

గుంటూరు జీజీహెచ్ అభివృద్ధికి దాతలు చేస్తున్న సాయం మరవలేనిదని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ అన్నారు. ఆస్పత్రి క్యాజువాలిటీలో పీజీ వైద్యుల డ్యూటీ రూంలో పట్టపు గోపి తన తండ్రి బసవ పున్నయ్య జ్ఞాపకార్థం వాటర్ కూలర్ వితరణగా అందజేశారు. డాక్టర్ యశశ్వి రమణ గురువారం గోపీతో కలిసి వాటర్ కూలర్‌ను ప్రారంభించారు.



బొమ్మలకొలువులో విద్యార్థులతో మల్లికార్జునరావు తదితరులు

ముందస్తు సంక్రాంతి సంబరాల సందడి

గుంటూరు ఎడ్యుకేషన్: రాజీవ్‌గాంధీ నగర్‌లోని శ్రీ వేంకటేశ్వర పబ్లిక్ స్కూల్లో గురువారం నిర్వహించిన ముందస్తు సంక్రాంతి సంబరాలు సంస్కృతి, సంప్రదాయాలను చాటాయి. ఉపాధ్యాయులతో పాటు విద్యార్థినీ, విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ బత్తిన మల్లికార్జునరావుతో పాటు ముఖ్య అతిథులుగా డాక్టర్ ఎండీ షహానా సుల్తానా, డాక్టర్ సంపత్‌కుమార్ పాల్గొన్నారు. ఆటపాటలతో విద్యార్థులు అలరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలి

పట్నంబజారు: తిరుమల తిరుపతి దేవస్థానంలో జరిగిన ఘటనకు పూర్తి బాధ్యత రాష్ట్ర ప్రభుత్వం వహించాలని వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్ర కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైకుంఠ ద్వార దర్శనానికి భక్తులు వేల సంఖ్యలో హాజరైన నేపథ్యంలో ప్రభుత్వం, టీటీడీ చైర్మన్ బి.ఆర్. నాయుడు సక్రమమైన చర్యలు చేపట్టడంలో పూర్తి వైఫల్యం చెందారని విమర్శించారు. దీనిపై పూర్తి బాధ్యత చంద్రబాబు నాయుడు ప్రభుత్వమే వహించాల్సిన అవసరం ఉందని చెప్పారు. భక్తుల మనోభావాలతో ఆటలాడుకుంటూ రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరించిన తీరు ఏమాత్రం సరికాదని తెలిపారు. కచ్చితంగా మృతుల కుటుంబాలకు, గాయాలపాలైన భక్తుల కుటుంబాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

భక్తి శ్రద్ధలతో రామాయణ పారాయణలు



నగరంపాలెం: స్థానిక మారుతీనగర్ శ్రీ కంచి కామకోటి పీఠ శ్రీ మారుతి దేవాలయ ప్రాంగణంలో శ్రీరామ మహా సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాల్లో భాగంగా గురువారం రామాయణ పారాయణలు, యుద్ధకాండ ఆనంద రామాయణం హోమాలు జరిగాయి. శ్రీమారుతి దేవాలయం, శ్రీరామ సేవా సమితి (వారణాసి) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం స్వామికి హారతి, నీరాజనం, మంత్రపుష్ప నిర్వహించారు. భక్తులకు ప్రసాదం వితరణ చేశారు. కార్యక్రమాలను తంగిరాల శ్రీనివాసరావు పర్యవేక్షించారు.

అయ్యప్ప స్వాములకు సద్ది



నగరంపాలెం: స్థానిక బృందావన్ గార్డెన్స్ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయం శ్రీ పద్మావతి కల్యాణ మండపం వేదికపై పుష్య మాసం సందర్భంగా గురువారం ధనుర్మాస ఉత్సవాలు నిర్వహించారు. భారతి ధార్మిక విజ్ఞాన పరిషత్ నిర్వాహకులు బొల్లేపల్లి సత్యనారాయణ, లలితాంబ దంపతులు, పాలకమండలి ఆధ్వర్యంలో జరిగాయి. ధార్మిక ప్రాంగణంలో అయ్యప్పలకు, మాలధారులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. తొలుత బొల్లేపల్లి లలితాంబ అయ్యప్ప స్వామికి హారతి, నైవేద్యం అనంతరం అయ్యప్ప నామస్మరణతో అన్నప్రసాద వితరణ ప్రారంభించారు. ఆలయ పాలక మండలి అధ్యక్షులు సీహెచ్. మస్తానయ్య, పాలక వర్గం పాల్గొన్నారు.

హోం మంత్రి అమిత్ షా రాజీనామా చేయాలి

లక్ష్మీపురం: అంబేడ్కర్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోం మంత్రి అమిత్‌షా బేషరతుగా రాజీనామా చేయాలని కాంగ్రెస్ పార్టీ మాజీ శాసన సభ్యుడు లింగంశెట్టి ఈశ్వరరావు డిమాండ్ చేశారు. ఏపీసీసీ పిలుపు మేరకు కోబాల్ట్‌పేటలోని అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలలతో నివాళులర్పించారు.

'వాహన్ పోర్టల్'ను వినియోగించుకోవాలి

డీటీసీ సీతారామిరెడ్డి



వాహనదారులతో సమావేశమైన డీటీసీ

పట్నంబజార్: వాహనదారులంతా వాహన్ పోర్టల్ వినియోగించుకోవాలని డీటీసీ కె.సీతారామిరెడ్డి తెలిపారు. స్వర్ణభారతీనగర్‌లోని ఆర్టీవో కార్యాలయంలో గురువారం అధికారులు పలువురు వాహనదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీసీ సీతారామిరెడ్డి మాట్లాడుతూ రవాణా వాహనాల యజమానులు జనవరిలో త్రైమాసిక పన్ను తప్పనిసరిగా చెల్లించాలని సూచించారు. వాహనాలకు ఈకేవైసీ అప్‌డేట్, మ్యాపింగ్, మొబైల్ నంబరు అప్‌డేట్ చేయించుకోవాలని సూచించారు. ఈ సర్వీసులకు సంబంధించి ఏదైనా సిటిజన్ సర్వీస్ సెంటర్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వాహనాల త్రైమాసిక పన్ను చెల్లించేందుకు ఈ సర్వీసులను అప్‌డేట్ చేసుకోవడం తప్పనిసరని చెప్పారు. అప్‌డేట్ చేయని పక్షంలో పన్ను చెల్లించడం సాధ్యపడదని తెలిపారు .

పార్టీ కార్యకర్తకు నివాళులు అర్పించిన ఎమ్మెల్సీ



జేమ్స్ మృతదేహం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్సీ అప్పిరెడ్డి

పట్నంబజారు: ఈస్ట్ పరిధిలోని కార్పొరేటర్ పాపతోటి అంబేడ్కర్ సోదరుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త పాపతోటి జేమ్స్ అనారోగ్యంతో మృతి చెందారు. గురువారం ఎమ్మెల్సీ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి బొంగరాలబీడులోని జేమ్స్ నివాసానికి వెళ్లి నివాళులు అర్పించారు. జేమ్స్ కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ అప్పిరెడ్డి మాట్లాడుతూ పార్టీ ఆవిర్భావం నుంచి జేమ్స్ ఎంతో క్రియాశీలకంగా పనిచేశారని తెలిపారు. ఆయన కుటుంబ సభ్యులకు పార్టీ తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారీ), ధూపాటి వంశీ, వైఎస్సార్ సీపీ నేతలు గులాం రసూల్, ఆలా కిరణ్, విజయ్, జాని పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో జాతీయ సదస్సు పోస్టర్ల ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వీసీ గంగాధరరావు తదితరులు

ఏఎన్‌యూ: ఫిబ్రవరి 6, 7 తేదీల్లో నాగార్జున విశ్వవిద్యాలయంలోని ఫారెస్ట్రీ విభాగంలో 'న్యూ పర్‌స్పెక్టివ్స్ ఇన్ ఫారెస్ట్రీ ఫర్ సస్టైనబుల్ డెవలప్మెంట్ అండ్ క్లైమేట్ చేంజ్' అనే అంశంపై జాతీయ సదస్సు నిర్వహిస్తున్నట్లు డైరెక్టర్ ఆచార్య కె.మల్లికార్జున తెలిపారు. సదస్సుకు బ్రోచర్‌ను గురువారం యూనివర్సిటీ వీసీ ఆచార్య కే. గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ ప్రస్తుతం ఫారెస్ట్రీ ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య కె. రత్న షీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలం, సదస్సు కోశాధికారి ఆచార్య వి. ఉమా మహేశ్వర రావు, ఆచార్య తిరుపతిరావు, ఆచార్య ఖాసిం, అధ్యాపకులు విజయ్, నాగరాజు, బాలరాజు పాల్గొన్నారు.

సైకాలజీ విభాగంలో..

విశ్వవిద్యాలయంలోని సైకాలజీ విభాగంలో ఫిబ్రవరి 6, 7 తేదీలలో రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహిస్తున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య టి.డి.విమల తెలిపారు. సదస్సు బ్రోచర్‌ను గురువారం వీసీ ఆచార్య కె. గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ జాతీయ సదస్సు నిర్వహణ సమాజ అవసరాలు తీరేలా, సమాజాభివృద్ధికి దోహదపడేలా ఉండాలని ఆకాంక్షించారు. ఆచార్య కె. రత్నషీలామణి, రిజిస్ట్రార్ ఆచార్య జి. సింహాచలంలు సదస్సు నిర్వహణకు సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగం అధ్యాపకులు అనుపమ, కృష్ణమోహన్, సిబ్బంది శాంతి పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో డైలీ వేజ్ వర్కర్స్ యూనియన్ రూపొందించిన నూతన సంవత్సర వార్షిక క్యాలెండర్ ను గురువారం వీసీ ఆచార్య కే. గంగాధరరావు విడుదల చేశారు. కార్యక్రమంలో వికాస కార్యదర్శి జె.శ్రీనివాసరావు, సంయుక్త కార్యదర్శులు నేలపాటి నాగేశ్వరరావు, టి. వెంకటేష్, కార్యవర్గ సభ్యులు పి.నాగరాజు, కె. శశిధర్, డైలీ యూనియన్ అధ్యక్షులు ఎం.వి.ఎస్. ప్రభాకర్, కార్యదర్శి నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.

ఆగ్రో ఫారెస్ట్రీ ద్వారా ఆహార, ఆర్థిక స్వాతంత్ర్యం



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎల్.అజిత్

ఏఎన్‌యూ: ప్రపంచ ఆగ్రో ఫారెస్ట్రీ రీజనల్ కోఆర్డినేటర్ ఎల్.అజిత్ చోనాచలం గురువారం విశ్వవిద్యాలయాన్ని సందర్శించారు. వృక్ష, సూక్ష్మజీవ, ఫారెస్ట్ విభాగాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రాంతాలకు రీజినల్ కోఆర్డినేటర్‌గా విధులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెస్సీ ఫారెస్ట్ విద్యార్థులతో సమావేశమయ్యారు. వాతావరణ పరిస్థితుల్లో ఆగ్రో ఫారెస్ట్రీ విధానం ద్వారా ఆహార, ఆర్థిక స్వాతంత్ర లభిస్తుందని పేర్కొన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఆగ్రో ఫారెస్ట్రీ మీద అవగాహన కల్పించేందుకు ఆయా సంస్థలు ముందుకు వస్తున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆగ్రో ఫారెస్ట్రీ పాలసీ- 2024కు, ఆగ్రో ఫారెస్ట్రీ కమిషన్ ఏర్పాటు చేయడానికి సహాయ సహకారాలు అందిస్తామని వివరించారు. మొక్కల పెంపకంతో పాటు వాటికి ఆర్థిక ప్రోత్సాహం, బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులు అంకుర పరిశ్రమలపై దృష్టి సారించాలని, ఫారెస్ట్రీ విభాగం ఆర్థిక సహకారం అందిస్తున్నట్లు వివరించారు. ఫారెస్ట్రీ కోర్సులు అభ్యసించిన విద్యార్థులకు ఉపాధి అవకాశాలు ఉంటాయని పేర్కొన్నారు. విభాగం అభివృద్ధికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంతో కలిసి కొన్ని కార్యక్రమాలు సంయుక్తంగా నిర్వహించేందుకు అవగాహన ఒప్పందాలు కుదుర్చుకొనున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య కే. మల్లికార్జున, ఆచార్య ఉమామహేశ్వరరావు, అధ్యాపకులు బాబు, నాగరాజు, విజయ్, బాలరాజు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో ఇంగ్లిష్ బోధన కొనసాగించాలి



లాడ్జి సెంటర్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

నెహ్రూనగర్: ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగుతో పాటు, ఇంగ్లిష్ బోధన కూడా కొనసాగించాలని భీమ్ భారత్ రాష్ట్ర అధ్యక్షులు పాగళ్ల ప్రకాష్ డిమాండ్ చేశారు. లాడ్జి సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం మాతృ భాష కావాలి.. అభివృద్ధి చెందడానికి ఇంగ్లిష్ బోధన కూడా అవసరమనే కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత డిసెంబర్ 28, 29 తేదీల్లో విజయవాడ కేబీఎన్ కాలేజీలో జరిగిన ప్రపంచ తెలుగు రచయితల మహాసభల వేదికపైన విద్యావంతులు, మేధావులు, ప్రముఖ రచయితలు ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఇంగ్లిష్ మీడియం రద్దు చేయాలని కోరడం సమంజసం కాదన్నారు. జీఓ నంబర్ 85ని ఆపివేయాలని తీర్మానం చేయడమే కాకుండా ప్రభుత్వానికి కూడా విజ్ఞప్తిని పంపించడం సబబుగా లేదని తెలిపారు.ఈ తీర్మానం దళిత, బహుజన బడుగు, బలహీన వర్గాల విద్యార్థుల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టివేసే విధంగా ఉందని తెలిపారు. తీర్మానాన్ని వెనక్కి తీసుకునేంత వరకు రాష్ట్రవ్యాప్తంగా ప్రజా ఉద్యమాలు నిర్వహిస్తామని దళిత ఉద్యమ వేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా ప్రభుదాస్ తెలియజేశారు. సమావేశంలో వివిధ సంఘాల నాయకులు సాధు మాల్యాద్రి, డెన్నిస్ రాయ్, పాటిబండ్ల కోటేశ్వరరావు, జీఆర్ భగత్ సింగ్, నల్లపు నీలాంబరం పాల్గొన్నారు.

ఫార్మసీ అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు గౌరవ పురస్కారం



మస్తానమ్మను అభినందిస్తున్న వీసీ

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎస్‌కే. మస్తానమ్మకు న్యూఢిల్లీలోని కేటీకే ఔట్ స్టాండింగ్ ఆన్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ భారత శిక్ష గౌరవ పురస్కార్ అవార్డును అందజేసింది. ఫార్మసీ విద్యారంగంలో గత 17 సంవత్సరాలుగా మస్తానమ్మ విద్యాభివృద్ధికి చేసిన కృషికి అవార్డు ఇచ్చినట్లు ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ. ప్రమీలారాణి తెలిపారు. మస్తానమ్మ ఇప్పటివరకు 70కి పైగా స్కోపస్, వెబ్ ఆఫ్ సైన్స్ ప్రతిష్టాత్మక జర్నల్స్ లో పరిశోధన పత్రాలను ప్రచురించినట్లు తెలిపారు. రెండు పేటెంట్ హక్కులు పరిశోధనలో నమోదు కాగా, ఆరు రాష్ట్రస్థాయి, జాతీయస్థాయి అవార్డులను ఇప్పటివరకు ఆమె అందుకున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా యూనివర్సిటీ వీసీ ఆచార్య కె.గంగాధరరావుతో అధ్యాపకులు డి. రవిశంకర్‌రెడ్డి, యు. అన్నపూర్ణ, కె. సుజన, పి. రవి, కె. విజయ్ కిశోర్, కేఈ. ప్రవల్లిక, గాయత్రి రమ్య, అధ్యాపకులు, సిబ్బంది మస్తానమ్మకు అభినందనలు తెలిపారు.

గ్రేడ్-1 ఫార్మసిస్టులుగా ఇద్దరికీ ప్రమోషన్లు



పదోన్నతి ఉత్తర్వులు అందజేస్తున్న డాక్టర్ సుచిత్ర

గుంటూరు మెడికల్: గుంటూరు ప్రాంతీయ వైద్య ఆరోగ్య శాఖ సంచాలకుల కార్యాలయం (ఆర్డీ)లో గురువారం ఫార్మసిస్టులకు ప్రమోషన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో గ్రేడ్-2 ఫార్మసిస్టులుగా పనిచేస్తున్న ఐదుగురు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ముగ్గురు ప్రమోషన్ వద్దని లిఖిత పూర్వకంగా తెలియజేశారు. కనిగిరి సీహెచ్‌సీలో పనిచేస్తున్న ఎస్.వి.నరసింహారావుకు నెల్లూరు హాస్పటల్‌లో గ్రేడ్-1 ఫార్మసిస్టుగా, ఈపూరుపాలెం పీహెచ్‌సీలో గ్రేడ్-2 ఫార్మసిస్టుగా పనిచేస్తున్న కె.భవానీశంకరరావుకు నెల్లూరు హాస్పటల్‌లో గ్రేడ్-1 ఫార్మసిస్టుగా ప్రమోషన్ ఇచ్చారు. ఆర్డీ డాక్టర్ కె.సుచిత్ర కౌన్సెలింగ్ నిర్వహించి ఇద్దరికీ ప్రమోషన్‌ఆర్డర్లు అందజేశారు. కార్యక్రమంలో డెప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసరెడ్డి, ఆఫీస్ సూపరింటెండెంట్ గోపవరపు స్టాన్లీ రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించే వరకు పోరు ఆగదు

నాలుగో రోజుకు చేరిన అంగన్‌వాడీల నిరహార దీక్షలు



శిబిరంలో మాట్లాడుతున్న ఎల్ఐసీ ఏజెంట్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ రామ్మోహన్

లక్ష్మీపురం: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గుంటూరు కలెక్టర్ కార్యాలయం ఎదుట ప్రారంభమైన నిరాహార దీక్షలు గురువారంతో నాలుగో రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏ.వి.యన్. కుమారి అధ్యక్షతన, ఎల్ఐసీ ఏజెంట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు గాంధీ రామ్మోహన్‌రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల అంగన్‌వాడీలు తీవ్ర ఇబ్బందికి గురవుతున్నారని తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి దీప్తి మనోజా మాట్లాడుతూ హెల్పర్లకు ప్రమోషన్ ఇవ్వకపోవడం వల్ల అంగన్‌వాడీల పని కుంటుపడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లాలో 105 సెంటర్లు ఖాళీగా ఉండటం వల్ల లక్ష్యాలు నెరవేరడం లేదని తెలిపారు. సమస్యలు పరిష్కరించాల్సిన ప్రభుత్వం, అధికారులు బాధ్యతారాహితంగా ఉంటున్నారని విమర్శించారు. సమస్యల పరిష్కారానికి జనవరి 10న జరిగే కలెక్టర్ కార్యాలయం ముట్టడి కార్యక్రమానికి జిల్లాలోని అన్ని ప్రాజెక్టుల నుండి వర్కర్లు హెల్పర్లు పెద్దసంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. నాలుగో రోజు దీక్షల్లో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యాలరావు, ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఎల్ఐసీ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు వి.వి.కె. సురేష్, ఎల్ఐసీ యూనియన్ మచిలీపట్నం డివిజన్ నాయకురాలు మధుబాల, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కె.పద్మ, ఎస్‌కే. బీబీ, చిన్న వెంకాయమ్మ, లక్ష్మీ, బాజీ, సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దండా లక్ష్మీనారాయణ, జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, చింతల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో ఎలీనా రాయ్‌కు చోటు



గుంటూరు ఎడ్యుకేషన్: లక్ష్మీపురంలోని శ్రీపాటిబండ్ల సీతారామయ్య సీబీఎస్ఈ పాఠశాలలో యూకేజీ చదువుతున్న కడియం ఎలీనా రాయ్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ పాటిబండ్ల విష్ణువర్ధన్ తెలిపారు. గురువారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పాఠశాల గౌరవాధ్యక్షుడు డాక్టర్ యలమంచిలి శివాజీ, పాటిబండ్ల విష్ణువర్ధన్ మాట్లాడుతూ ఐదేళ్ల 33 రోజుల వయసులో గరిష్ట సంఖ్యలో 95 ప్రత్యామ్నాయ ఫుట్‌రోప్ స్కిప్‌లను 30 సెకన్లలో ప్రదర్శించినందుకు రికార్డు సాధించినట్లు వివరించారు. అతి పిన్న వయసులోనే పెద్ద విజయాన్ని అందుకున్న చిన్నారి భవిష్యత్తులో మరెన్నో విజయాలు అందుకోవాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో పాఠశాల పాలకవర్గసభ్యుడు గింజుపల్లి వరప్రసాదరావు, అకడమిక్ డైరెక్టర్ లేళ్ల కృష్ణవేణి, హైస్కూల్, ప్రైమరీ ప్రిన్సిపాల్స్ జంపని పద్మజ, కర్లపూడి పార్వతీ దేవి, కో-ఆర్డినేటర్లు దుర్గాశ్యామ్, శ్రీదేవి పాల్గొన్నారు.